క్లుప్తంగా

'యువత పోరు'ను విజయవంతం చేయండి


తిరుపతిరావు

బాడంగి: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీన జరగబోయే యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడు తెంటు తిరుపతిరావు పిలుపునిచ్చారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, విద్య, వసతిదీవెనలు ఇవ్వకుండా అటు విద్యార్థులను, ఇటు నిరుద్యోగులను కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ చేపట్టే యువత పోరుకు పార్టీ శ్రేణులతో పాటు యువత, విద్యార్థులు, నిరుద్యోగులు భారీ సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

చోడి పంట సాగుపై రైతుల ఆసక్తి


సోమరాజుపేటలో సాగు చేస్తున్న చోడి పంట

రేగిడి: చోడిపంట సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 320 ఎకరాల్లో పంట సాగులో ఉందని ఏవో మురళీకృష్ణ తెలిపారు. ఈ పంటకు మార్కెట్ మంచి డిమాండ్ ఉండడంతో పాటు చోడితో చేసే ఆహార పదార్థాలు మెరుగైన ఆరోగ్యానికి ఉపయోగపడుతుండడంతో ప్రతీ రైతు చోడి పంట వేసేందుకు మక్కువ కనబరుస్తున్నారని పేర్కొన్నారు.

పైడితల్లిని దర్శించుకున్న భక్తులు


పైడితల్లిని దర్శించుకుంటున్న భక్తులు

రాజాం/రాజాం సిటీ: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవంగా పేరొందిన రాజాంలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయ 99వ జాతర ఉత్సవాలు ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే జాతరలో తొలి రోజు నుంచే పైడితల్లి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివస్తున్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు 85 మంది ఎంపిక


వృద్ధురాలి కళ్లను తనిఖీ చేస్తున్న వైద్యుడు

రేగిడి: స్థానిక విశ్వసాయి మందిరం వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మొత్తం 120 మంది కంటి రోగులు శిబిరానికి రాగా వారికి వైద్యులు తనిఖీ చేసి వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 85 మందిని నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి సంయుక్త సహకారంతో జరిగిన ఈ శిబిరంలో కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారికి ఉచితంగా సర్జరీ చేయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆప్తాలమిక్ అధికారి సురేష్, సత్యసాయి భజన మండలి కన్వీనర్ మామిడి శివప్రసాద్, క్యాంపు కో–ఆర్డినేటర్ అశ్వనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు అప్పగించండి


టిడ్కో ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకుడు శంకరరావు

బొబ్బిలి: టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాట్నూరు శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని రామన్నదొరవలస వద్ద టిడ్కో కాలనీని ఆయన ఆదివారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలోని మొత్తం 1280 ఇళ్లకు రోడ్లు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. టీడీపీ హయాంలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తే వైఎస్సార్ సీపీ హయాంలో రివర్స్ టెండరింగ్ ద్వారా నిర్మాణం చేశారని పేర్కొన్నారు. ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం పూర్తయిన ఇళ్లను ఆయా లబ్ధిదారులకు అందించాలని, లేకపోతే పెద్దఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఆయన వెంట సీపీఎం మండల కన్వీనర్ ఎస్.గోపాలం, జి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

తగ్గుతున్న మొక్కజొన్న సాగు!

- గతంలో కన్నా తగ్గిన సాగు విస్తీర్ణం
- డిమాండ్ లేకనే రైతుల నిరాసక్తి
- క్వింటా రూ.2,100లు మించని ధైనం


సోపేరు సమీపంలో మొక్కజొన్న సాగు


కొనుగోలుదారుల కోసం సిద్ధం చేసి ఉంచిన మొక్కజొన్న పప్పు బస్తాలు

రాజాం: రబీ సీజన్‌లో మంచి ఆదాయాన్ని అందించే పంటల్లో మొక్కజొన్న పంట ముందంజలో ఉండేది. ఖరీఫ్ సాగు తర్వాత వచ్చే రబీ సీజన్‌లో అన్ని నేలల్లోనూ ఇదే పంటను వేసి రైతులు లబ్ధి పొందేవారు. పెట్టుబడి తక్కువగా ఉండడంతో పాటు కూలీల అవసరం కూడా పెద్దగా లేకపోవడం, దిగుబడి ఆశించిన స్థాయిలో వస్తుండడంతో ఈ పంట సాగుకు రైతులు ఆసక్తి కనబరిచేవారు. ఎకరా పొలంలో సాగు చేస్తే 25 క్వింటాళ్లకు పైగా పప్పు దిగుబడిగా వస్తూ రైతులను లాభాల బాట పట్టించేది. అయితే ప్రస్తుతం ఈ పంటకు ఇటీవల మార్కెట్‌లో డిమాండ్ బాగా తగ్గింది. ఈ ప్రభావం సాగుపై పడింది. ఫలితంగా ఏటా జరిగే మొక్కజొన్న సాగు విస్తీర్ణం తగ్గుతూ వస్తోంది. గతంలో వెనకాముందు ఆలోచించకుండా మొక్కజొన్న సాగుకు ముందుకు వచ్చే రైతులు ఇప్పుడు పంట వేయాలంటే ఆచీతూచీ అడుగులేస్తున్నారు.

3,100 హెక్టార్లకు పరిమితం..

రాజాం నియోజకవర్గంలో 2022–23 ఏడాది రబీ సీజన్‌లో 5,476 హెక్టార్లలో మొక్కజొన్న పంటను రైతులు సాగుచేశారు. అప్పట్లో క్వింటా పప్పు ధర రూ.2,400లు ఉండేది. 2023–24 ఏడాదిలో ఈ సాగు 3,800 హెక్టార్లకు పడిపోయింది. ఎక్కువగా పంట తెగుళ్ల బారిన పడడంతో పాటు పండిన పంటకు మార్కెట్‌లో డిమాండ్ లేకపోవడం, దళారీలను ఆశ్రయించి విక్రయిస్తే సకాలంలో డబ్బులు రాకపోవడంతో రైతులు సాగుకు అంతగా ఆసక్తి కనబరచడం లేదు. ఈ ఏడాది కూడా క్వింటా పప్పు ధర రూ.2,400కు మించి పలకడం లేదు. ఖరీఫ్ అనంతరం చాలా ప్రాంతాల్లో రబీ సీజన్‌లో మొక్కజొన్న సాగు చేస్తారని వ్యవసాయ శాఖ ఆశించింది. రైతులు మాత్రం విత్తనాల రాయితీలు లేక, రైతు భరోసా అందక, పండిన పంటకు ప్రభుత్వం మద్దతు ధర ఇవ్వకపోవడంతో సాగును తగ్గించేశారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో నియోజకవర్గంలో 5,515 హెక్టార్లలో మొక్కజొన్న సాగు లక్ష్యంగా అధికారులు పెట్టుకోగా, ఇప్పటివరకు కేవలం 3,100 హెక్టార్లకు మాత్రమే సాగు పరిమితమైంది. పంట నుంచి వచ్చే కందెలను పప్పుగా ఆడించి, నాణ్యత ప్రకారం విక్రయాలు చేసినా దళారీలకే విక్రయించాల్సి రావడం, దళారీలు సిండికేట్‌గా ఏర్పడి క్వింటా పప్పును రూ.2,100కు మించి కొనుగోలు చేయకపోవడంతో ఈ పరిస్థితి కనిపిస్తోంది. వీటికి తోడు ఇటీవల పౌల్ట్రీఫామ్‌లో కోళ్ల పెంపకం కూడా తగ్గించడంతో మేతకు అవసరమైన పప్పు కొనుగోలు పడిపోయింది. గతంలో వీటి ఎగుమతులు ఉండేవి. ప్రస్తుతం అవికూడా లేకపోవడంతో రైతులు మొక్కజొన్న సాగు వదిలి పంటపొలాలను కొర్పు పొలాలుగా వదిలేస్తున్నారు.

అమ్మేందుకు ఎదురుచూడాల్సిన పరిస్థితి..

గతంలో మొక్కజొన్న సాగుకు మంచి డిమాండ్ ఉండేది. గిట్టుబాటు ధర కూడా ఉండేది. ఇప్పుడు పెద్దగా పంటకు మార్కెట్ లేదు. దళారీలకు విక్రయించేందుకు ఎదురుచూడాల్సిన పరిస్థితి. అరువు అమ్మకాలు చేయాలి. డబ్బులు రాకుంటే ఏమీ చేయలేని పరిస్థితి. అందుకే ఈ ఏడాది మొక్కజొన్న సాగును పక్కనపెట్టాం.

–బూరాడ రమణమూర్తి, రైతు, పొగిరి, రాజాం మండలం

మొక్కజొన్నకు బదులు అపరాలు వేశాం..

గతంలో మొక్కజొన్న పప్పుకు మంచి డిమాండ్ ఉండేది. ఫౌల్ట్రీ కంపెనీలు ముందుగానే అడ్వాన్స్‌లు ఇచ్చేవి. ప్రభుత్వం కూడా ఈ–క్రాప్ నమోదు చేసి రైతుకు అండగా ఉండేది. ఇప్పుడు పరిస్థితి మారింది. ఏమి చేయాలో తెలియని పరిస్థితి. మొక్కజొన్న సాగుకు బదులు అపరాల పంటలు వేసి, అనంతరం పొలాలు వదిలేశాం.

–ఎస్.అప్పలనాయుడు, రైతు, వన్నలి, రేగిడి మండలం

గత ప్రభుత్వం ఆదుకుంది..

2020–21, 2021–22 ఆర్థిక సంవత్సరాల రబీ సీజన్‌లలో మొక్కజొన్న పప్పును రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఆ సమయంలో కోవిడ్ విపత్తుతో పాటు అకాల వర్షాల కారణంగా పప్పు దిగుబడి తగ్గడం, విక్రయాల్లో రైతులు ఇబ్బందులు పడడాన్ని ప్రభుత్వం గమనించింది. అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం క్వింటా పప్పును నాణ్యత ఆధారంగా రూ.2,200 నుంచి రూ.2,400 వరకు ధర చెల్లించి, కొనుగోలు చేసి రైతులను ఆదుకుంది. మరో వైపు రైతులకు పంటల మార్పిడి, వాణిజ్య పంటల ఉత్పత్తిని పరిచయం చేసింది. ప్రస్తుతం ఖరీఫ్ మిగులు ధాన్యం కొనుగోలు చేయలేక ఈ ప్రభుత్వం చేతులెత్తేయడంతో పాటు రబీ సీజన్‌లోనూ తమకు కష్టాలు తప్పవని భావించి రైతన్నలు మొక్కజొన్న సాగును పక్కన పెట్టేశారు.

పోలిపల్లి పైడితల్లి సన్నిధిలో డాక్టర్ రాజేష్


పూజలు చేస్తున్న డాక్టర్ తలే రాజేష్ తదితరులు

రాజాం: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి సన్నిధికి వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆదివారం వెళ్లి, అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కుటుంబ సభ్యులు సహా దేవదాయ శాఖ అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికి, గర్భగుడిలో కొలువైన అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి చల్లని చూపు అందరిపై ఉండాలని ఆయన వేడుకున్నారు. ఆయన వెంట పార్టీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, డాక్టర్ నరేంద్ర, సలాది తులసీదాస్ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబుది పక్షపాత వైఖరి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్

రేగిడి: సీఎం చంద్రబాబుది పక్షపాత వైఖరి అని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ విమర్శించారు. ఇదే విషయమై ఆయన మండలంలోని మజ్జిరాముడుపేటలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించి, మాట్లాడారు. ముఖ్యమంత్రి అంటే ఏదో ఒక పార్టీకి కాదని, రాష్ట్ర ప్రజలందరి బాగోగులు చూసుకోవాల్సిన వ్యక్తి అని, అలాంటి ఉన్నతమైన స్థానంలో ఉన్న వ్యక్తి తమ పార్టీ నాయకులు, కార్యకర్తల స్వలాభమే లక్ష్యంగా పనిచేస్తుండడం, పని చేయాలని అటు అధికారులు, ఇటు ఆయన పార్టీ నాయకులను ఆదేశిస్తుండడం అత్యంత హేయమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడం జరిగిందని గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలోని కూటమి ప్రభుత్వం మాత్రం రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమాన్ని విస్మరిస్తోందని, తమ పార్టీ వారికే ప్రజాధనం దోచిపెడుతోందని ధ్వజమెత్తారు. రాజధాని అమరావతి పేరిట రాష్ట్ర ఖజానాను లూటీ చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు అండ్ కో చేస్తున్న అరాచక పాలనను ప్రజలంతా గమనిస్తున్నారని, సమయం చూసి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికైనా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి, ప్రజావిశ్వాసం పొందాలని హితవు పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, ఎంపీటీసీ ఎర్నేన అప్పలనాయుడు, సర్పంచ్ కెంబూరీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి చిన్నమ్మతల్లి పండగ

రామభద్రపురం: మండల కేంద్రంలో చిన్నమ్మతల్లి పండగ సోమవారం ఆరంభం కానుంది. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజు అమ్మవారి తొలేళ్ల ఉత్సవం, మంగళవారం ఘటాల తిరువీధి, బుధవారం అంజలి రథోత్సవం, అనుపోత్సవం నిర్వహించనున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా పెద్దఎత్తున భక్తులు తరలివస్తారు. జాతర మహోత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు ఏర్పాటు చేసింది.

70 ఏళ్ల తర్వాత అక్కడ పండగ..

తెర్లాం: మండలంలోని కొల్లివలస, గొలుగువలస గ్రామాల్లో సోమవారం నుంచి గ్రామదేవతల పండగ గ్రామస్తులు జరుపుకోనున్నారు. కొల్లివలసలో ఎన్నో ఏళ్ల క్రితం గ్రామదేవత పండగ జరుపుకున్నారు. మళ్లీ ఇప్పుడు మూడు రోజుల పాటు పండను చేసుకునేందుకు గ్రామస్తులు నిర్ణయించారు. ఇదిలా ఉంటే గొలుగువలసలో 70 ఏళ్ల తర్వాత గ్రామదేవత పండగ జరుపుకుంటున్నారు.

బాడంగి: స్థానికంగా జరిగే పోలమ్మతల్లి పండగలో భాగంగా ఊరి పొలిమేరలో వెలసిన పోలమ్మతల్లిని సోమవారం గ్రామంలోకి తోడ్కొని వస్తారు(ఆహ్వానిస్తారు). ఆ రోజు నుంచి వారం రోజుల పాటు అమ్మవారి ఘటాలు, పాలజంగిడి ఊరేగించి బియ్యం దండుతారు. ఆ మరుసటి వారం అనగా ఈ నెల 16, 17, 18వ తేదీల్లో అమ్మవారి పండగ అట్టహాసంగా జరుపుకుంటారు. ఆదివారం ఉయ్యాల కంబాల ఉత్సవం, సోమవారం తొలేళ్ల సంబరం, మంగళవారం దేశమ్మతల్లి అనుపోత్సవం, బుధవారం పోలమ్మతల్లి అనుపోత్సవంతో పండగ ముగుస్తుంది.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: విద్యార్థులంతా ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు ఎలా చదివి అర్థం చేసుకోవాలో ఆయన నేర్పించారు. పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం కలగడంతో పాటు అనేకానేక కొత్త విషయాలు తెలుస్తాయన్నారు. గ్రంథాలయంలోని చిల్డ్రన్స్ క్లబ్‌లో చేరాలని విద్యార్థులను కోరారు.

కళాకారుల ప్రతిభకు పోటీలు దోహదం


పోటీలు ప్రారంభిస్తున్న డీఎస్పీ రాఘవులు

రాజాం సిటీ: కళాకారుల్లోని ప్రతిభను వెలికితీసేందుకు నాటక రంగ పోటీలు ఎంతగానో దోహదపడతాయని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు అన్నారు. స్థానిక పోలిపల్లి పైడితల్లి జాతర పురస్కరించుకుని, ఎస్‌పీఆర్ కళా పరిషత్ ఆధ్వర్యంలో మహిళా కళాకారులచే ఉత్తరాంధ్ర స్థాయి ఏకపాత్రాభినయం పోటీలు ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన.. వెండితెర, బుల్లితెరల ప్రభావంతో నాటక రంగం నేడు అంతరించిపోయే పరిస్థితికి వచ్చిందన్నారు. అటువంటి కళా రంగాన్ని బతికించుకునేందుకు కళాకారులు పడుతున్న తపన అభినందనీయమన్నారు. మహిళా కళాకారులను ప్రోత్సహించేందుకు కళా పరిషత్ చేస్తున్న కృషి కూడా అమోఘమన్నారు. ఒకప్పుడు వీధి నాటకాలకు మంచి ఆదరణ ఉండేదని గుర్తుచేశారు. కళారంగాన్ని, కళాకారులను బతికించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ప్రతిఒక్కరూ కళాకారులను గౌరవించుకోవడాన్ని బాధ్యతగా భావించాలన్నారు. అనంతరం ఏకాపాత్రాభినయం చేసిన కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో కళా పరిషత్ అధ్యక్షుడు సలాది తులసీదాస్, టౌన్, రూరల్ సీఐలు కె.అశోక్‌కుమార్, హెచ్.ఉపేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 15లోగా భూ ఆధార్ చేయించుకోండి

మెంటాడ: సొంతభూమి కలిగిన రైతులంతా ఈ నెల 15వ తేదీలోగా భూ ఆధార్ చేయించుకోవాలని ఏవో గోకులకృష్ణ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. వన్–బి లేదా పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు జిరాక్సులతో పాటు ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నంబర్ కలిగిన సెల్‌ఫోన్‌తో రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ ఫార్మర్ రిజిస్ట్రేషన్ జరిగితేనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే రైతు సంబంధిత సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

శరవేగంగా సీసీ కాలువ నిర్మాణం


నిర్మించిన సీసీ కాలువ

రాజాం: పట్టణంలోని ఎల్‌ఐసీ భవనం వెనక ప్రశాంతి నగర్ అనుసంధాన రోడ్డులో సీసీ కాలువ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. మొత్తం రూ.2.75 లక్షల 15వ ఆర్థికసంఘం నిధులతో ఈ నిర్మాణ పనులు చేస్తున్నట్లు మున్సిపల్ ఏఈ వెంకట్ తెలిపారు. 300 మీటర్ల పొడవునా కాలువ నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పశువులకు టీకాలు


ఆవుదూడకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

బాడంగి: మండలంలోని రేజేరు గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఆదివారం వేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 13,500 పశువులు ఉండగా, ఇప్పటివరకు 3,400 పశువులకు ఈ టీకాలు వేశామని పశువైద్యాధికారి సతీష్ తెలిపారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మూగజీవాలు వ్యాధుల బారినపడకుండా ముందస్తుగా టీకాలు వేస్తున్నామన్నారు.

అధ్వానంగా రోడ్లు.. జనం అవస్థలు!



రేగిడి మండలంలోని పలు రోడ్లు అధ్వానంగా ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఉంగరాడమెట్ట నుంచి వన్నలి మీదుగా ఖండ్యాం.. చిన్నయ్యపేట జంక్షన్ నుంచి పెద్దపుర్లి.. తాటిపాడు జంక్షన్ నుంచి గుళ్లసీతారాంపురం వెళ్లే రహదారులు శిథిలమైపోయి ఉండడంతో అటువైపుగా వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దారంతా గుంతలు, రాళ్లు తేలిపోయి ఉండడంతో ఆ దారిలో వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. ప్రభుత్వం స్పందించాలని, కొత్త రోడ్లు వేయకపోయినా కనీసం రోడ్ల మరమ్మతులు అయినా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–రేగిడి

జాతర సందడి



రామభద్రపురంలో చిన్నమ్మతల్లి పండగకు ముందు జాతర సందడి నెలకొంది. ఏటా అమ్మవారి పండగ ముందురోజు సిరుల పోతన్న జాతర ఘనంగా నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి అమ్మవారి మూడు రోజుల పండగ ఆరంభం కానుండగా ఆదివారం సిరుల పోతన్న జాతర అట్టహాసంగా చేశారు. సిరుల ఎల్లమ్మ, పోతన్నల జాతరగా పిలువబడే ఈ ఉత్సవానికి వేలాది మంది భక్తులు హాజరై, అమ్మవారికి పసుపు, కుంకుమ, గుడ్లు, ఉలవలు కలిపిన బియ్యం, చీరలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ప్రతిమతో పాటు పాము ఆకృతిలోని సిరుల పోతన్నను పురవీధుల్లో మేళతాళాలు, డప్పువాయిద్యాల నడుమ ఊరేగించారు.

–రామభద్రపురం

తక్షణమే నిధులు విడుదల చేయాలి



సాయన్నచానల్, ఏకేఎల్(ఆకులోవకట్ట) గెడ్డల ఆధునీకరణకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని సాయన్నచానల్ నీటి సంఘం అధ్యక్షుడు నారు జనార్దనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సాయన్నచానల్ షట్టర్లు పూర్తిగా పాడవ్వడంతో పొలాలకు సాగునీరు సక్రమంగా వెళ్లడం లేదన్నారు. గత కొన్నేళ్లుగా చాలాచోట్ల సాగునీటి కాలువలను బాగుచేయని కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు కాలువల పరిస్థితి పరిశీలించి, వాటిని బాగు చేసేందుకు నిధుల కోసం ప్రభుత్వానికి నివేదికలివ్వాలని కోరారు.

–రేగిడి

తవ్వేసి వదిలేశారు..!



బొబ్బిలిలోని వేణుగోపాలస్వామి ఆలయ కూడలిలో కోరాడ వీధికి వెళ్లే మార్గంలో తాగునీటి పైపులైన్ మరమ్మతులు చేపట్టేందుకు పెద్దగొయ్యి తవ్వేసి అలానే వదిలేశారు. రోజులు గడుస్తున్నా ఆ గొయ్యిని అలానే వదిలేయడంతో ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళ ఇటుగా వచ్చే వారు ప్రమాదవశాత్తు గొయ్యిలో పడిపోతే పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా గొయ్యిని పూడ్చాలని కోరుతున్నారు.

–బొబ్బిలి